
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

ఆదివారం 20 అక్టోబరు 2024



విద్యాసాగర్‌రావుతో శిక్షణ పొందిన మహిళలు

భవితకు భరోసా

- నాగారంలో ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రం
- ఏడేళ్లుగా నిర్వహణ
- ఇప్పటి వరకు 1300 మందికి శిక్షణ

6



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్

రైతును రాజుగా చూడడమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల ప్రారంభం

8

ముగిసిన వెంకన్న బ్రహ్మోత్సవాలు



స్వామివారికి అభిషేకం

సిరిసిల్ల అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నాగబలి పుష్పయాగం, దేవతా ఉద్వాసన, గ్రామబలి, స్వామివారి ఏకాంత సేవాతో ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 11 రోజులపాటు స్వామి వారు వివిధ వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. పులికాపుతో మొదలైన బ్రహ్మోత్సవాల్లో శేషవాహనం, హంస వాహనం, అశ్వ వాహనం, గరుడ, కాళింగమర్ధనం, హన్మంత వాహనం, చంద్ర వాహనం, గజ వాహనం, రంగనాయక తిరుప్పాలం, పొన్నం వాహనం, మహారథంపై స్వామివారిని ఊరేగించారు. మహా పూర్ణాహుతి, చక్రతీర్థం, ఏకాంత సేవ, ఆండాళ్లమ్మకు ఒడిబియ్యం, శ్రీవారి కల్యాణం వంటి కార్యక్రమంలు వైభవంగా నిర్వహించారు.

న్యూస్ బాక్స్

హిందూ ధర్మాన్ని రక్షించాలి


వేములవాడ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సనాతన హిందూ ధర్మాన్ని రక్షించాలని వీహెచ్‌పీ నాయకులు డిమాండ్ చేశారు. వేములవాడ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 15 రోజులుగా హిందూ దేవతుల ఆలయాలపై, పండగలపై తీవ్రవాదు దాడులు చేయడంతో మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు. ప్రభుత్వం మతోన్మాదులపై చర్యలు తీసుకోవాలని, హిందువుల ఆలయాలను, సంస్కృతీసంప్రదాయాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో గడప కిషోర్‌రావు, నాగుల రాములు, గౌరీశెట్టి శ్రీనివాస్, హరీష్, కొమురవెల్లి వికాస్, ఆడేపు శ్రీనివాస్ ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

ఇల్లంతకుంట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేపాక గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం చేపట్టింది. ప్రధానమంత్రి మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు ఆకర్షితులవుతున్నారని నాయకులు పేర్కొన్నారు. మండలంలో సభ్యత్వ నమోదుకు భారీగా స్పందన లభిస్తోందన్నారు. మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్, నాయకులు రొండ్ల మధుసూదన్‌రెడ్డి, ముత్తక్క, సాయగౌడ్, అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరానికి స్పందన

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 19 (ఆంధ్యజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం, వేములవాడ ఆయుర్వేదిక్ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సిరిసిల్ల పట్టణంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. డాక్టర్ స్వరూప పరీక్షలు చేశారు. ఆయుష్ డిపార్ట్‌మెంట్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ తిరుపతి, తెలంగాణ ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బలరాం, ప్రధాన కార్యదర్శి సుధాకర్, పట్టణ అధ్యక్షుడు లక్ష్మన్‌రావు ఉన్నారు.



స్వామియే.. శరణం అయ్యప్ప

- నవంబరు 15న మకర విళక్కుతో మండల పూజలు ప్రారంభం
- మహాపాదయాత్రగా బయల్దేరుతున్న దీక్షాపరులు
- జిల్లాలో మొదలైన అయ్యప్పల సందడి

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఎన్నెన్ని నామాలో... అయ్యప్ప స్వామి... ఎన్నెన్ని నియమాలో. శరణం అయ్యప్ప, కన్నిమూల గణపతిని వేడుకొని స్వామి కార్తీక మాసంలో మాలలు వేసుకుంటిమి. హరిహరసుతునే శరణం అయ్యప్ప.. అంటూ మాలధారులు అయ్యప్పస్వామిని కొలవనున్నారు. తలపై ఇరుముడితో, మండల దీక్షతో శబరిమలకు లక్షలాది మంది భక్తులు సాగిపోయే కాలం మొదలైంది. రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి మహా పాదయాత్రలు మొదలయ్యాయి. సిరిసిల్ల నుంచి ఇప్పటికే 50 మంది అయ్యప్ప స్వాములు ఇరుముడులతో పాదయాత్రగా బయల్దేరి వెళ్లారు. దట్టమైన అరణ్యంలో... అంబరాన్ని చుంబించే పర్వతాల మీదుగా సాగే ఆ యాత్ర ఓ ఆధ్యాత్మిక ఘట్టం. జిల్లా నుంచి అయ్యప్ప స్వాములు కాలినడకన 1400 కిలోమీటర్ల దూరం ఇరుముడితో ఏటా పాదయాత్ర చేస్తున్నారు. అయ్యప్పల సందడి సంక్రాంతి రోజున శబరి మలలో జ్యోతి దర్శనం వరకు కనిపిస్తుంది.

15న మకరవిలక్కుతో మండల పూజలు ప్రారంభం

శరీరాన్ని, మనస్సును అదుపులో ఉంచుకొని సన్మార్గంలో పయనింపజేసేదే అయ్యప్ప మండల దీక్షగా భావిస్తారు. 41 రోజుల పాటు అయ్యప్పకు ఆత్మనివేదన చేసుకుంటూ నిత్య శరణు ఘోషతో పూజిస్తారు. రోజులో ఒకసారి భిక్ష, మరోసారి అల్పాహారం, రెండు సార్లు చన్నీటి స్నానం, నేలపై నిద్రించాలనే కఠిన నియమాలు పాటిస్తారు. నవంబరు 15 నుంచి అయ్యప్ప దేవాలయాల్లో మండల పూజ ప్రారంభమవుతున్న క్రమంలో దీక్షలు పొందడానికి భక్తులు సిద్ధమవుతున్నారు. జిల్లాలో అయ్యప్ప మాల దీక్ష స్వీకరిస్తున్న భక్తుల సంఖ్య ఏటా పెరుగుతున్నారు.

ఇప్పటికే మాలలు స్వీకరించిన భక్తులు శరణు ఘోష వినిపిస్తుండగా కార్తీక పౌర్ణమి రోజు వేలాది మంది భక్తులు మాలధారణకు పొందుతారు. నవంబరు 15వ తేదీన సన్నిధానంలో శబరిమల అయ్యప్ప స్వామి ఆలయాన్ని తెరుస్తారు. అప్పటి నుంచి డిసెంబరు 26వ తేదీ వరకు మండల పూజ మహోత్సవాలు నిర్వహిస్తారు. 30వ తేదీన మకరవిలక్కు నిర్వహిస్తే, జనవరి 14న మకరవిలక్కు, 19న అయ్యప్ప దేవాలయాన్ని మూసి వేస్తారు. మకరవిలక్కు దర్శనానికి ఎక్కువ సంఖ్యలో భక్తులు వెళ్తారు.



మోక్ష మార్గానికి 18మెట్లు

అయ్యప్ప స్వామి హరిహరసుతుడు, మణికంఠుడిగా పిలుస్తారు. అయ్యప్ప పూజా సంప్రదాయం అధికంగా దక్షిణ భారత దేశంలో కనబడుతుంది. అయ్య అంటే విష్ణువు, అప్ప అంటే శివుడు ఈ పేర్ల సంగమమంతోనే అయ్యప్ప నామం పుట్టిందని తెలుస్తుంది. మహిషీ అనే రాక్షసుడిన్ని చంపి అయ్యప్ప శబరిమలైలో వెలిశాడని చెప్పుకుంటారు. కేరళలోని శబరిమలై హిందువుల యాత్ర స్థలాల్లో ఒకటి. ఏటా ఐదు కోట్ల మంది భక్తులు దేవాలయాన్ని సందర్శిస్తారు. అయ్యప్ప స్వామిని దర్శించుకునే వారు 18మెట్లు ఎక్కడమే భాగ్యంగా భావిస్తారు.

అయ్యప్పస్వామి ఎత్తైన ప్రదేశానికి ఎక్కడానికి ప్రయత్నించగా నాలుగు వేదాలు, రెండు శాస్త్రాలు, అష్ట దిక్పాలకులు, విద్య, అవిద్య, జ్ఞానము, అజ్ఞానానికి రూపమైన దేవాతా మూర్తులు 18మెట్లుగా ఏర్పడి ఆ ప్రదేశానికి అయ్యప్ప చేరుకోవడానికి దోహద పడ్డారని చెప్పుకుంటారు. మెట్లకు సంఖ్యాపరంగా కూడా ప్రధాన్యం ఉంది. శ్రోత్ర, త్వక్, చక్షు, జిహ్వా, ఘ్రాణం ఇవి ఐదు జ్ఞానేంద్రియాలు, వాక్, పాణి, ఉపస్థ, పాల, పాయువులు కర్మేంద్రియాలు ఐదు, అన్నమయ, ప్రాణమయ, మనోమాయ, విజ్ఞాన మాయ, ఆనందమాయ ఈ ఐదు పంచకోశాలు, సత్వం, రజస్సు, తపస్సు ఈ మూడు త్రిగుణాలు ఇవన్ని కలిపితే 18 వీటనన్నింటిని అదుపులో ఉంచగలిగిన వారికే పరబ్రహ్మ సాక్షాత్కారం మోక్షస్థితి లభిస్తుంది. మిగతా 8వ పేజీలో

హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనుల భూ సేకరణకు రూ.6.96 కోట్లు మంజూరు

సిరిసిల్ల రూరల్/వేములవాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ - తిప్పాపూర్ మధ్య మూలవాగుపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా భూసేకరణ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ.6 కోట్ల 96 లక్షల నిధులను మంజూరు చేసిందని, కలెక్టర్ ఖాతాలో జమ చేసిందని వేములవాడ శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వెల్లడించారు. 2015లో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభంకాగా, భూసేకరణ కోసం అవసరమైన నిధులు కేటాయించకపోవడంతో గత ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, భూసేకరణ నిమిత్తం రూ.6 కోట్ల 96 లక్షల నిధులు మంజూరు చేసి జిల్లా కలెక్టర్ పీడీ ఖాతాలో జమ చేసిందని వెల్లడించారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం నిధులు విడుదల కావడంతో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించే అవకాశం ఉందని ఆది శ్రీనివాస్ వివరించారు.

జిల్లా గంథ్రాలయ చైర్మన్‌కు సన్మానం



జిల్లా గంథ్రాలయ చైర్మన్‌ను సన్మానిస్తున్న కవులు, రచయితలు

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 19 (అంధ్రజ్యోతి) : సిరిసిల్ల జిల్లా సినారె గ్రంథాలయ నూతన చైర్మన్‌గా నియామకమైన నాగుల సత్యనారాయణ గౌడ్‌ను శనివారం కవులు, రచయితలు సన్మానించారు. మానేరు రచయితల సంఘం అధ్వర్యంలో పుష్ప గుచ్ఛాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎలగొండ రవి, జూకంటి జగన్నాథం, బూర దేవానందం, చిటికెన కిరణ్‌కుమార్, అంకారపు రవి, కామారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మైనార్టీ కళాశాలలో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు

సిరిసిల్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మైనార్టీ సంక్షేమ కళాశాలలో పలు పోస్టుల భర్తీకి శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. వేములవాడ మైనార్టీ సంక్షేమ కళాశాలలో టీజీటీ ఇంగ్లీష్, జీఎఫ్ సీ (జనరల్ ఫౌండేషన్ కోర్సు) పోస్టులు ఖాళీ ఉండగా, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు ఇటీవల దరఖాస్తులు ఆహ్వానించారు. మెరిట్ ఆధారంగా టీజీటీ ఇంగ్లీష్ ఒక పోస్టుకు ఆరుగురిని, జీఎఫ్‌సీ పోస్టుకు నలుగురిని ఇంటర్వ్యూలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. తొమ్మిది మంది హాజరయ్యారు. మైనార్టీ సంక్షేమ విద్యాసంస్థల ఇన్‌చార్జి రాధాబాయి, ఓఎస్‌డీ సర్వర్ మియా, వేములవాడ మైనార్టీ సంక్షేమ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, ఆర్ఎల్ సీ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మైక్రో ఫైనాన్స్ సంస్థలు వేధింపులకు పాల్పడితే చర్యలు

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు విరుద్ధంగా జిల్లాలో మైక్రో ఫైనాన్స్ సంస్థలు రుణాల రికవరీలో ప్రజలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో మైక్రో ఫైనాన్స్ కంపెనీవారు, వడ్డీ వ్యాపారులు, లోన్ యాప్ సంబంధిత వర్గాలు కిస్తీల చెల్లింపునకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జారీ చేసిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. లోన్ రికవరీ కోసం వేధింపులకు గురి చేయడం, ఇంటి దగ్గరికి వెళ్లి అవమానించడం, ఇష్ట రాజ్యాంగా వ్యవహరించడం వంటివి మానివేయాలని, లేనిపక్షంలో చట్ట ప్రకారం పోలీస్ కేసులు, కఠిన చర్యలు తీసుకుంటున్నామని హెచ్చరించారు. మైక్రో ఫైనాన్స్ వాళ్లు డబ్బులు చెల్లించాలని వేధిస్తే బాధితులు నేరుగా తనను కలవాలని, వేధింపుదారుల నుంచి రక్షణ కల్పిస్తామని తెలిపారు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోవడం సరైన నిర్ణయం కాదని, మీపై ఆధారపడి ఉన్న కుటుంబం ఏమైపోతుందో ఆలోచించాలని కోరారు.

బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ కావాలి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, అక్టోబరు 19 (అంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ కావాలని, మారుమూల గ్రామాలకు అందాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జనాభాకు అనుగుణంగా బ్యాంకుల సంఖ్యను పరిశీలించాలని, రుద్రంగి, మల్యాల, నిజామాబాద్ గ్రామంలో నూతన బ్యాంక్‌లు అవకాశం మేరకు ఏర్పాటు చేయాలని అన్నారు. రానున్న మూడు మాసాలలో జిల్లాలోని యువత స్వయం ఉపాధి రంగాలలో అభివృద్ధి చెందేలా రుణాలు అందజేయాలని కోరారు. ప్రజలకు బ్యాంకుల ద్వారా అందిస్తున్న వివిధ రకాల రుణాలపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని, మైక్రో ఫైనాన్స్ కంపెనీలు, లోన్ యాప్‌ల నుంచి రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితి రాకుండా ఉంటుందని అభిప్రాయపడ్డారు. బ్యాంకర్లు నిర్వహించే అవగాహన కార్యక్రమాలపై ఒకరోజు ముందుగానే సమాచారం అందజేయాలని సూచించారు. సామాన్యులకు బ్యాంకు లావాదేవీలపై మరింత అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం స్వయం సహాయక మహిళా సంఘాలకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మెప్మా తరపున వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు వచ్చే ప్రతిపాదనలు పరిశీలించాలని, రుణాలు త్వరగా అందేలా చూడాలని అన్నారు. వేములవాడ దేవాలయం దగ్గర చిన్న చిన్న దుకాణాలు, వ్యాపారాలు నడిపే వ్యక్తులు బయట వ్యక్తుల నుంచి 3 శాతం నుంచి 5 శాతం వరకు వడ్డీలకు అప్పులు తీసుకుంటున్నారని, వీరిని గుర్తించి పీఎం స్వానిధి కింద రుణాలు అందజేయాలని అన్నారు. రుద్రంగిలో కెనరా బ్యాంక్, మల్యాలలో యూబీ ఐ, నిజామాబాద్‌లో ఎస్‌బీఐ బ్రాంచ్‌ల ఏర్పాటుకు ప్రతిపా దించగా బ్యాంకర్లు సుముఖం వ్యక్తంచేశారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రజలలో ఆర్థిక అక్షరాస్యత పెంచే దిశగా బ్యాంకర్లు క్యాంపులు నిర్వహించాలన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత, మహిళా సంఘాలకు అవసరమైన శిక్షణ అందించాలని సూచించారు. ప్రగతి, సోషల్ సెక్యూరిటీ పథకాలపై గ్రామీణ ప్రాంతాలలో అవగాహన కల్పించాలని, అర్హులైన జన్ ధన్ ఖాతాదారులందరికీ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా పథకాలు అందేలా చూడాలని అన్నారు. రాబోయే మూడు నెలల కాలంలో అర్హులైన ఖాతాలను గుర్తించి వారికి పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై పథకాలు వర్తింపజేయాలన్నారు. జిల్లాలో పంట రుణాల కింద 2024-25 సంవత్సరానికి 77425 ఖాతాలకు సంబంధించి రూ.1519 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా, జూన్ చివరి నాటికి 14476 ఖాతాలకు రూ.201 కోట్లు మాత్రమే పంపిణీ చేసినట్లు చెప్పారు. రుణమాఫీ ప్రక్రియ ముగుస్తున్నందున రుణాల రెన్యూవల్ పూర్తి చేసి నిర్దేశిత లక్ష్య సాధన దిశగా కృషి చేయాలన్నారు. వ్యవసాయ టర్మ్ రుణ లక్ష్యం రూ.421 కోట్లకు రూ.135 కోట్లు మాత్రమే అందజేయడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బ్యాంకులు వ్యవసాయ టర్మ్ రుణ లక్ష్యాల సాధన దిశగా కృషి చేయాలన్నారు. పీఎంఎఫ్ఈ. క్రింద ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమను ప్రోత్సహించే దిశగా ప్రస్తుతం ఉన్న యూనిట్ల విస్తరణకు, నూతన యూనిట్ల గ్రౌండింగ్ చర్యలు తీసుకోవాలన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున్, ఆర్‌బీఐ ఎల్‌డిఓ సాయి తేజరెడ్డి, నాబార్డ్ డీడీఎం దిలీప్ చంద్ర, యూబీఐ. డీజీఎం అపర్ణ రెడ్డి, వివిధ బ్యాంక్ కంట్రోలర్లు, మేనేజర్లు, సంబంధిత జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

కోనరావుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలంలోని సుద్దాల, మల్కపేట, వెంకట్రావుపేట గ్రామాల్లో శనివారం పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు శనివారం అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేసినందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కచ్చకాయల ఎల్లయ్య, బాల్‌రెడ్డి, పల్లె మంజుల రవీందర్ రెడ్డి, బొర్ర రవీందర్, యాకూబ్ బాబా, సుంకరి పరుశరాములు, లక్ష్మణ్, ఉప్పుల గంగయ్య నీరటి సంజీవ్, బుచ్చి రాములు, దేవయ్య పాల్గొన్నారు.

అధైర్యపడకండి.. ఆదుకుంటాం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అధైర్యపడకండి.. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం భరోసా కల్పించారు. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలో ఇటీవల పిడుగు పాటుకు మృతి చెందిన రైతు కామిడి నర్సింహారెడ్డి, అనారోగ్యంతో చనిపోయిన జక్కుల అంజయ్య కుటుంబాలను శనివారం పరామర్శించారు. సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. స్పందించిన కలెక్టర్ తక్షణ సాయం కింద రూ.లక్ష చెక్కును నాయబ్ తహసీల్దార్ సత్యనారాయణ ద్వారా అందించారని అన్నారు.

నేర పరిశోధనలో సీసీ కెమెరాలు కీలకం

- ఎస్పీ అఖిల్ మహాజన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 19 (అంధ్రజ్యోతి): కేసుల్లో శిక్షల శాతం పెంచాలని, నేర పరిశోధనలో సీసీ కెమెరాలు కీలకమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేరాల నియంత్రణలో భాగంగా నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ప్రధాన కూడళ్లు, గృహసముదాయాలు, వ్యాపార, వర్తక, వాణిజ్య కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, గుడుంబా, ఇసుక అక్రమ రవాణా, పీడీఎస్ రైస్‌పై ఉక్కుపాదం మోపాలన్నారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. వాహనాలపై దృష్టిసారించాలన్నారు. నేరాల నియంత్రణలో గ్రామ పోలీస్ అధికారి కీలకపాత్ర పోషించాలన్నారు. గ్రామ పోలీస్ అధికారి వ్యవస్థను బలోపేతం చేయాలని, సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. జిల్లాలో హిస్టరీ, రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠినంగా వ్యవహరించాలన్నారు. గ్రామాలు, పట్టణాలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఫంక్షనల్ వర్టికల్స్ అమలుకు కృషిచేసిన 20 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీలు చంద్రశేఖర్‌రెడ్డి, మురళీకృష్ణ, సీఐలు కె.కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌లు, ఆర్ఐలు యాదగిరి, రమేశ్ , ఎస్సైలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మినీ వ్యాన్

● ఇద్దరి మృతి



సంఘటన స్థలంలో వాహనాలు, మృతులు (ఫైల్)

తిమ్మాపూర్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండల పరిధిలోని రాజీవ్‌రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరు చికిత్స పొందుతూ మృతిచెందారు. ఎల్‌ఎండీ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూక్య రాజు(40), లావుడియా వాగ్య(29) ఇద్దరు సొంత బావ, బావమరుదులు. వీరిది సిద్దిపేట జిల్లా ధూలిమిట్ట మండలం కూటిగల్ గ్రామ పంచాయతీ పరిధిలోని చర్చ్ తండాకు చెందిన వారు. గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూనే సెల్‌టవర్స్ కేబుల్ పనులు(ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్స్)గా రాష్ట్ర వ్యాప్తంగా పనులు చేస్తూ ఉంటారు. లావుడియా వాగ్యకు రెండు నెలల క్రితం బాబు పట్టాడు. కాగా బాబు అనారోగ్యంతో జనగామలోని ఆస్పతిలో చికిత్స పొందుతున్నాడు. బాబును చూసేందుకు ఇద్దరు కలిసి ఆదిలాబాద్‌లో పనులు ముగించుకొని జనగామకు తమ మినీవ్యాన్‌లో బయలుదేరారు. ఈ క్రమంలో తిమ్మాపూర్ మండలంలోని ఎల్‌ఎండీ కాలనీ వద్ద మహిళా ప్రాంగణం సమీపంలో శుక్రవారం రాత్రి 11గంటల సమయంలో ఓ లారీని డ్రైవర్ రాజీవ్ రహదారిపై నిలిపివేశాడు. ఇండికేటర్ లైట్స్ కూడా వేయక పోవడంతో చీకట్లో లారీ కనిపించలేదు. దీంతో మినీవ్యాన్ వేగంగా లారీని ఢీకొని కిందకు వెళ్లింది. వ్యాన్ నడుపుతున్న వాగ్యతో పాటు భూక్య రాజు వాహనంలో ఇరుక్కుపోయారు. చాలా సేపు వరకు వాహనంలోనే ఇద్దరు ఇబ్బంది పడ్డారు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు, స్థానికులు శ్రమించి ఇద్దరిని వాహనంలో నుంచి బయటకు తీసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం మేరకు ఎల్‌ఎండీ పోలీసులు అక్కడికి చేరుకుని లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గాయపడ్డ భూక్య రాజు, లావుడియా వాగ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారు జామున మృతి చెందారు. సొంత బావ, బావమరుదులు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివేక్ తెలిపారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

హుజూరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుడగజంగం కాలనీకి చెందిన బాలిక అదృశ్యమైనట్లు తల్లిదండ్రులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం సాయంత్రం కిరాణ షాపునకు వెళ్లిన బాలిక ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులను ఆరా తీశారు. ఆచూకీ లభించ లేదు. కాగా ఇదే ప్రాంతానికి చెందిన శేఖర్ అనే వివాహితుడు సైతం కనబడకుండా పోవడంతో అనుమానించిన బాలిక తల్లిదండ్రులు అతడిపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

కత్తితో బెదరించి చోరీకి యత్నం

● నిందితుడి కోసం పోలీసుల గాలింపు

మంథని, అక్టోబర్ 19: మండలంలోని గుంజపడుగు గ్రామంలో మినీ ఏటీఎంలో ఓ దుండగుడు కత్తితో బెదిరించి చోరీకి శుక్రవారం రాత్రి విఫల యత్నం చేశాడు. పోలీసుల కథనం ప్రకారం..మూస రజిత గ్రామంలో మినీ ఏటీఎం నిర్వహిస్తుండగా హఠాత్తుగా ఓ దుండగుడు ముసుగు ధరించి చేతిలో కత్తితో మినీ ఏటీఎంలోకి ప్రవేశించాడు. రజితను బెదిరించి డబ్బులు ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించగా ఆమె అరవడంతో దుండగుడు అక్కడి నుంచి పారిపోయాడు. గ్రామస్థులు పట్టుకోవడానికి ప్రయత్నించినా సాధ్యం కాలేదు. రజిత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. దొంగ ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ రమేష్ కోరారు.

క్రిప్టో కరెన్సీ, బిట్ కాయిన్ పేర్లతో పెట్టుబడులు

- మోసాలకు పాల్పడుతున్న ముఠా - ఐదుగురి అరెస్టు

జగిత్యాల క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): క్రిప్టో కరెన్సీ, బిట్ కాయిన్ పేర్లతో పెట్టుబడులు పెట్టిస్తూ ప్రజలను మోసాలకు గురిచేస్తున్న ముఠాను జగిత్యాల పోలీసులు గుట్టురట్టు చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ముఠా సభ్యుల వివరాలతో పాటు మోసాలకు పాల్పడిన తీరును టౌన్ సీఐ వేణుగోపాల్ వివరాలు వెల్లడించారు. జగిత్యాల పట్టణంలోని అరవింద్‌నగర్‌కు చెందిన గుమ్మడి నర్సయ్య, కోయల్‌కర్ వేణు, ఆరే రాజేష్ కుమార్, కురెల బాబు, తాటిపెల్లి గ్రామానికి చెందిన కొట్టె మారుతీలతో పాటు కొంత మంది క్రిప్టో కరెన్సీ, బిట్ కాయిన్ పేర్లతో పెట్టుబడులు పెట్టించేటి ముఠాగా ఏర్పడ్డారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ డబ్బులు ఆశ చూపిస్తూ ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, అమాయక ప్రజలను నమ్మించి ఆన్‌లైన్ కాయిన్ వ్యాపారం గురించి వివరిస్తూ డబ్బులు పెట్టుబడులు పెట్టిస్తూ ఈజీ మనికి అలవాటు పడ్డారు.

జిల్లా కేంద్రంలో మొదలైన ఈ దందా పెగడపల్లి మండలం బతికపెల్లి, తాటిపెల్లితో పాటు అన్ని ప్రాంతాల్లో విస్తరింపజేశారు. ఈ ముఠా సభ్యులు రెక్సాస్ ట్రేడ్ యాప్ అనే ఆన్‌లైన్ ట్రేడ్ యాప్ ద్వారా యూఎస్‌డీటీ బీఈపీ-20 అనే క్రిప్టో కరెన్సీలో లక్షలాది రూపాయలను పెట్టుబడులు పెట్టించారు. పెట్టిన పెట్టుబడి 18 నెలల్లో ఐదు నుంచి 10 రెట్లు వస్తాయని దీనికి తమది పూచికత్తు అంటూ నమ్మబలికారు. ఇలా ఎంత మందిని చేర్పిస్తే అంత లాభాలు వస్తాయంటూ వందలాది మందితో పెట్టుబడులు పెట్టించి నెలకు కొంత సొమ్మును వారికి ట్రస్ట్ వ్యాలెట్ ద్వారా చెల్లిస్తూ వ్యాపారాన్ని విస్తరించారు.

కొద్ది రోజులుగా యాప్ సరిగా పనిచేయకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ముఠాను గుట్టు రట్టు చేశారు. శనివారం ఐదుగురితోపాటు మరికొంత మందిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జిల్లా వాసులు మోసపూరిత ట్రేడింగ్ యాప్‌లో కష్టపడి సంపాదించిన డబ్బులు పెట్టుబడులు పెట్ట వద్దని కోరారు. ఇలాంటి వ్యాపారాలు చేసే వ్యక్తుల సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

హాస్టల్ నుంచి విద్యార్థులు అదృశ్యం

● కొండగట్టులో గుర్తించిన పోలీసులు


కొండగట్టు పోలీసుల అదుపులో విద్యార్థులు

మానకొండూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని సమీకృత హాస్టల్‌లో ఉంటూ బాలుర ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు శుక్రవారం అదృశ్యమయ్యారు. రాత్రి జగిత్యాల జిల్లా కొండగట్టు హనుమాన్ ఆలయ ప్రాంగణంలో పోలీసులు గుర్తించి హాస్టల్ సిబ్బందికి అప్పగించారు. చొప్పదండి మండలంలోని చాకుంట గ్రామానికి చెందిన ఆకుల నితీష్ (11), మానకొండూర్ మండలంలోని శ్రీనివాసనగర్ గ్రామానికి చెందిన మద్దంకుల శ్రీనివాస్ (11) వెనుకబడిన సమీకృత హాస్టల్ ఉంటు చదువుకుంటున్నారు. శుక్రవారం హాస్టల్ నుంచి ఇద్దరు చిన్నారులు చెప్పాపెట్టకుండా బయటికి వెళ్లారు. హాస్టల్ వార్డెన్, సిబ్బంది మానకొండూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చుట్టుపక్కల పోలీస్‌స్టేషన్‌లను అప్రమత్తం చేశారు. మానకొండూర్ నుంచి కరీంనగర్ చేరుకున్న విద్యార్థులు జగిత్యాల వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కి కొండగట్టు దిగువన దిగారు. ఓ బొమ్మల వ్యాపారికి అనుమానాస్పదంగా కనిపించడంతో ఆరా తీసి అక్కడి పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకొని భోజనం చేయించిన అనంతరం మానకొండూర్ పోలీసులకు అప్పగించారు.

కెరీర్

భవితకు భరోసా

నాగారం
వృత్తి విద్య శిక్షణ కేంద్రం యువత ఉపాధికి భరోసా ఇస్తోంది. నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్, నర్సింగ్, టైలరింగ్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తూ ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. ఏడేళ్లలో 1300 మంది యువతీయువకులకు శిక్షణ ఇవ్వగా 1000 మందికి పైగా వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు పొందారు.

- నాగారంలో ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రం
- ఏడేళ్లుగా నిర్వహణ
- ఇప్పటి వరకు 1300 మందికి శిక్షణ
- మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు ప్రోత్సాహంతో కొనసాగింపు


నాగారంలో ఏర్పాటు చేసిన జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రం
నర్సింగ్ కోర్సులో శిక్షణ పొందుతున్న యువతులు

కోనరావుపేట, అక్టోబరు 19: కోనరావుపేట మండలం నాగారంలోని వృత్తి విద్య శిక్షణ కేంద్రం యువత భవిష్యత్‌కు భరోసా కల్పిస్తోంది. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్న మనేని విద్యాసాగర్ రావు ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కోనరావుపేట మండలం నాగారంలో పుట్టి పెరిగిన చెన్నమనేని విద్యాసాగర్ రావు యువత కోసం గ్రామంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సహకారంతో శిక్షణ కేంద్రాన్ని ఏడు సంవత్సరాల క్రితం ప్రారంభించి విజయవంతంగా కొనసాగిస్తున్నారు. 2017 సెప్టెంబరు 2న శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం శిక్షణ కేంద్రంలో ఎలక్ట్రీషియన్, నర్సింగ్, టైలరింగ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. నాలుగు సంవత్సరాల క్రితం ఎలక్ట్రీషియన్, నర్సింగ్, టైలరింగ్‌తోపాటు బైక్ మెకానిక్ కోర్సులోనూ శిక్షణ ఇచ్చారు. ఇప్పటి వరకు 1300 మంది యువతకు శిక్షణ ఇచ్చి 1000 మందికి వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలను కల్పించి వారి భవితకు భరోసా నింపారు. శిక్షణ కేంద్రంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత శిక్షణ, భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన యువతీయువకులకు సర్టిఫికెట్లను అందజేస్తున్నారు. శిక్షణ పూర్తయిన యువత వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాల్లో స్థిర పడ్డారు.

శిక్షణ కేంద్రం బాగుంది.

- ఎండీ సాజీనా, రాళ్లపేట



జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రం బాగుంది. నేను నర్సింగ్ కోర్సులో శిక్షణ పొందుతున్నాను. ఉచితంగా శిక్షణ, భోజన వసతి కల్పించి సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. సర్టిఫికెట్ పొందిన అనంతరం ఈ ఫౌండేషన్ వారే ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందడం చాలా సంతోషంగా ఉంది.

టైలరింగ్ శిక్షణ పొందుతున్నా

- గీతాంజలి, మర్తనపేట



జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రంలో నేను టైలరింగ్ శిక్షణ పొందుతున్నాను. ఇందులో అన్ని వసతులు కల్పిస్తూ శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ అందజేస్తున్నారు. సర్టిఫికెట్‌తో ఎక్కడైనా పని చేసుకోవచ్చనే భరోసా ఉంది. ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు.

ఇప్పటికి 60 బ్యాచ్‌లు పూర్తి చేశాం

- వరలక్ష్మి ఫౌండేషన్ వృత్తి విద్య శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి మహేష్



నాగారంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సహకారంతో మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు ప్రోత్సాహంతో ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నాం. ఇప్పటి వరకు 60 బ్యాచ్‌లను పూర్తి చేశాం. ప్రస్తుతం ఎలక్ట్రీషియన్, నర్సింగ్, టైలగింగ్ కోర్సులను నిర్వహిస్తున్నాం. 1300 యువతీ యువకులు శిక్షణ పొందారు. వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాం. నిరుద్యోగ యువతకు శిక్షణ ఎంతగానో దోహదపడుతుంది.


శిక్షణ పొందిన యువకులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు (ఫైల్)


ఎలక్ట్రీషియన్‌లో శిక్షణ పొందుతున్న యువకులు

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయులు

మానకొండూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని పోచంపల్లి ఆదర్శ పాఠశాలలో ఓ విద్యార్థిని ఉపాధ్యాయులు చితకబాదిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఎ ఆదిత్య అనే విద్యార్థి పోచంపల్లి ఆదర్శ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ప్రార్థన ముగిసిన తర్వాత తరగతి గదిలోకి అందరితో పాటు ఆదిత్య వెళుతుండగా ఉపాధ్యాయులు జయసింగ్, శ్రీనివాస్ క్రమశిక్షణ పాటించడం లేదంటూ తీవ్రంగా కొట్టారు. ఆ దెబ్బలకు తట్టుకోలేక ఆదిత్య కింద పడి స్పృహ కోల్పోయాడు. కంగారుపడ్డ ఉపాధ్యాయులు వెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. పోచంపల్లి ఆదర్శ పాఠశాలలో విద్యార్థి ఆదిత్యను ఇద్దరు ఉపాధ్యాయులు జయసింగ్, శ్రీనివాస్‌లు చితకబాదిన సంఘటనపై డీఈవో జనార్దన్‌రావు శనివారం పాఠశాలలో విచారణ జరిపారు. ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మరోసారి ఇలాంటి సంఘటనలు జరుగవద్దన్నారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ పోటీలు


కరీంనగర్‌లో లాంగ్ జంప్ చేస్తున్న క్రీడాకారిణి


సుల్తానాబాద్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన అండర్-19 ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్, హాకీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. అండర్-19 ఎస్జీఎఫ్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి మధు జాన్సన్, జిల్లా యువజన క్రీడా అధికారి శ్రీనివాస్‌గౌడ్, సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయరఘునందన్‌లు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగి రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులకు అథ్లెటిక్స్‌లోని రన్స్, జంప్స్ త్రోస్ అంశాలలో పోటీలను నిర్వహించారు. హాకీ క్రీడలను నిర్వహించి ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. సాయంత్రం విజేతలకు పతకాలను అందించారు. కార్యక్రమంలో కోచ్ మార్కండేయ, పీడీలు ఎన్నిక్, సుష్మ, సరిత, దస్తగిరి, వికాస్, గౌతమ్, విష్ణు, రాజశేఖర్, అఖిల్, మహ్మద్ తారీక్ అలీ, నారాయణ పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

సుల్తానాబాద్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పెద్దపల్లి జిల్లా క్రీడలు, యువజన శాఖ అధికారి సురేష్ అన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను శనివారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, ఎస్‌ఐ శ్రావణ్ కుమార్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షులు ముస్త్యాల రవీందర్, ప్రిన్సిపాల్ రాంచంద్రారెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, యూనిక్ పాషా పాల్గొన్నారు.

పుట్టిన ఊరిపై మమకారం..

ఆదర్శం


చల్మెడ లక్ష్మీనర్సింహారావు

- మల్కపేటలో ఆధునిక వసతులతో పాఠశాల భవనం
- నిర్మాణం చేపట్టిన చల్మెడ కుటుంబ సభ్యులు
- గ్రామాభివృద్ధి లక్ష్యంగా పనులు


పాఠశాల గదిలో ఏర్పాటు చేసిన బెంచీలు వివిధ రకాల బొమ్మలు

కోనరావుపేట, సెప్టెంబరు 19 : పుట్టిన ఊరిపై మమకారంతో భవిష్యత్ తరాలకు ఆధునిక వసతుల మధ్య విద్యనందిస్తున్నారు. కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో మాజీ న్యాయశాఖ మంత్రి చల్మెడ ఆనందరావు కుటుంబ సభ్యులు ఆయన తన తల్లి జానకి దేవి జ్ఞాపకార్థం సుమారు రెండు కోట్ల రూపాయలతో ప్రభుత్వ పాఠశాల భవనాన్ని నిర్మించారు. రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వ హయాంలో 'మన ఊరు మన బడి' కార్యక్రమంలో భాగంగా భవనాన్ని ప్రారంభించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన అందిస్తున్నారు. మల్కపేట గ్రామ విద్యార్థులతోపాటు చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారు.


మల్కపేటలో నిర్మించిన ఆధునిక పాఠశాల భవనం

గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే తపన

- చల్మెడ ఆనందరావు, మాజీ మంత్రి



మల్కపేట గ్రామంలో పుట్టి పెరిగిన మా కుటుంబానికి గ్రామాన్ని ఏదో విధంగా అభివృద్ధి చేయాలనే తపన ఉంది. అందుకే ఆధునిక సౌకర్యాలతో పాఠశాల భవనం నిర్మించాం. శుద్ధ జల కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. మహిళా సంఘం భవనానికి నిధులు కేటాయించాం. మల్కపేట కట్టపై ఆరు కోట్లతో రామాలయ నిర్మాణం చేపట్టాం. అది త్వరలో పూర్తి చేస్తాం.

నలుగురు దొంగల అరెస్ట్

● నాలుగు బైక్‌లు స్వాధీనం

శ్రీరాంపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బైక్‌లు దొంగిలించి విక్రయించడానికి తీసుకెళ్తుండగా శ్రీరాంపూర్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ వివరాలు వెల్లడించారు. గోదావరిఖనికి చెందిన అజ్మీరా అక్షయ్ కుమార్, దొంతుల ప్రశాంత్, దేవ సహాయం సెల్వ, చిట్యాల పృథ్వీ అను నలుగురు యువకులు బైక్‌లపై గోదావరిఖని వైపు నుంచి మంచిర్యాల వైపు వెళ్తూ జీఎం కార్యాలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసుల కంటపడ్డారు. వెంటనే వారిని ఆపి డాక్యుమెంట్లు చూపించాలని కోరగా, వారు ఎలాంటి వాహన పత్రాలు చూపలేదు. దీంతో అదుపులోకి తీసుకొని విచారణ చేయగా, నలుగురు యువకులు గత నెల రోజులుగా ఎలాంటి పని లేకుండా, చెడు అలవాట్లకు, జల్సాలకు బానిసయ్యారని తెలిసింది. డబ్బు కోసం శ్రీరాంపూర్, జైపూర్, రామగుండం ఏరియాలలో నాలుగు బైక్‌లను దొంగిలించారు. వాటిని గోదావరిఖనిలో విక్రయిస్తే దొంగతనం బయటపడుతుందని భావించి మంచిర్యాలలో అమ్మేందుకు తీసుకెళ్తుండగా, శ్రీరాపూర్ జీఎం కార్యాలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. బైక్‌లను స్వాధీనపర్చుకొని, నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఏసీపీ వివరించారు. శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్‌ఐలు సంతోష్, లక్ష్మీప్రసన్నలను ఏసీపీ అభినందించారు.

దత్తాత్రేయస్వామి ఆలయానికి బోటు సౌకర్యం

- ఎంపీ నిధులతో కొనుగోలు



బోటులో ప్రయాణిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బోయినపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలం వరదవెల్లి దత్తాత్రేయ స్వామి ఆలయానికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ బోటు సౌకర్యం కల్పించారు. దత్తాత్రేయ స్వామి గుట్ట చుట్టూ మిడ్ మానేరు బ్యాక్ వాటర్ విస్తరించి ఉండడంతో నిత్య పూజలకు ఇబ్బందులు తలెత్తేవి. కొద్ది నెలల క్రితం దత్తాత్రేయస్వామి గుట్టపై జరిగిన స్వామి వారి జయంత్యుత్సవాలకు బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారి దర్శించుకునేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని బండి సంజయ్ దృష్టికి ఆలయ కమిటీ సభ్యులు తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన బండి సంజయ్ స్వామివారిని దర్శించుకునేందుకు భక్తుల సౌకర్యం కోసం రూ.10 లక్షల మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ నిధులతో బోటును కొనుగోలు చేసి శనివారం ఆలయానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు బోటును ప్రారంభించి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కి ఆలయ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

మిడ్‌మానేరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో

బోయినపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ఎల్‌ఎండీ ప్రాజెక్ట్‌కు రెండు గేట్ల ద్వారా 4,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల ప్రస్తుతం 317.17, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు పస్తుతం 26.86 టీఎంసీల మేర ఉంది.

ఎస్‌యూ వీసీగా ఉమేష్ కుమార్ బాధ్యతలు



వీసీగా బాధ్యతలు తీసుకుంటున్న ప్రొఫెసర్ ఉమేష్ కుమార్

గణేశ్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వ విద్యాలయం ఉపకులపతిగా శనివారం హైదరాబాద్ సచివాలయంలో ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి వీసీగా విధులు నిర్వహిస్తున్న ఐఏఎస్ అధికారి సురేంద్ర మోహన్‌ను సచివాలయంలో కలసి ఉపకులపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శాతవాహన యూని వర్సిటీ సిబ్బంది వీసీ ఉమేష్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఆచార్య ఉమేష్‌కుమార్ సోమవారం ఉదయం 11 గంటలకు యూనివర్సిటీ ప్రాంగణానికి రానున్నారు.

రాష్ట్ర విద్యా కమిషన్ సలహాదారుగా ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత



గణేశ్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సలహాదారులను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతకు ఇందులో చోటు దక్కింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ వెంకటేశం ఉత్వర్వులు జారీ చేశారు. ఆమె 22 ఏళ్లుగా సోషియాలజీ బోధిస్తున్నారు. సూరేపల్లి సుజాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో దళిత మహిళా సాధికారతపై పీహెచ్‌డీ చేశారు.


జాతీయస్థాయి క్యాంపునకు ఎంపికైన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

గణేశ్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ జాతీయ సేవా పథకం విభాగానికి చెందిన పది మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు జాతీయ స్థాయిలో నిర్వహించబడే అడ్వెంచర్ క్యాంపునకు ఎంపికైనట్లు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు శనివారం తెలిపారు. అక్టోబరు 22నుంచి 31 వరకు హిమాచల్‌ప్రదేశ్‌లో అడ్వెంచర్ ట్రైనింగ్ క్యాంప్ నిర్వహిస్తారని తెలిపారు. ఈ అడ్వెంచర్ క్యాంపునకు కంటిన్జెంట్ లీడర్‌గా ఎస్ఆర్ ఆర్ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పడాల తిరుపతి వ్యవహరిస్తున్నారు. ఎంపికైన వలంటీర్లను శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, శాతవాహన యూనివర్సిటీ జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ మనోహర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కంచు తిరుపతి, డాక్టర్ రాజేశం, డాక్టర్ అర్జున్, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ ఆడెపు శ్రీనివాస్, డాక్టర్ స్వప్న, డాక్టర్ శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ అనిల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



జాతీయస్థాయి క్యాంపునకు ఎంపికైన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

ఆదివారం ప్రత్యేకం



'సూడు...సూడు మని..చుట్టం ఇంటికి వస్తే చాయ బొట్టు పోద్దామంటే కసికెడన్ని పాలు కూడా లేక పాయే'..

అనే మాటలు గతంలో గ్రామీణ ప్రాంతాల్లో వినిపించేవి. ఈ మాటలు చాయ మారుమూల పల్లె ప్రజల పానీయంగా మారి వారి జీవితాలతో ఎలా పెనవేసుకొని పోయిందో దర్పణం పడుతున్నాయి.

కాస్మోపాలిటన్ నగరం నుంచి పల్లెటూరి ప్రజల వరకు చాయ తాగందే తెల్లవారదు. చాయ మన భారతీయ పానీయం కాదు.. బ్రిటిష్ వాళ్లు మనల్ని పాలించిన సమయంలో అది దేశంలోకి ప్రవేశించి ఇక్కడి ఆహారపానీయాల్లో ఒకటిగా కలగలిసి పోయింది. ఇంటికి మిత్రులో... చుట్టాలో వస్తే మంచినీరు, చాయ అందించడం కనీస మర్యాదగా మారిపోయింది. దీంతో ఊరూరా..నగరాల్లో వాడవాడనా...చాయ్ దుకాణాలు వెలిశాయి. ఉదయం పూట మాత్రమే చాయ్ తాగే అలవాటు ఉండేది. క్రమేపీ సాయంత్రం టీ తాగడం అలవాటైంది. ఇప్పుడు ఒక్కొక్కరు నాలుగైదేసి సార్లు తాగనిదే రోజు గడవని స్థితికి చేర్చింది.

♦ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్



కార్పొరేట్ చాయ్

- అందుబాటులోకి వివిధ రకాల టీలు
- రూపుమారిన టీ కొట్లు
- రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ

ప్రజలు చాయ్ తాగకుండా ఉండలేని తనాన్ని కార్పొరేట్ రంగం తన వ్యాపారంగా మార్చుకున్నది. ఎవరు చాయ్ చేసినా తేయాకు మాత్రమే వినియోగించాల్సి ఉన్నా కార్పొరేట్ రంగం రకరకాల బ్రాండ్ ఇమేజ్‌లను సృష్టించి వ్యాపారాన్ని కొత్త పుంతలు తొక్కించింది. పూర్వకాలంలో గుడిసె హోటళ్లలో బొగ్గుల పొయ్యి మీద చాయ కాచి కేతిర్లలో నిలువచేసి అమ్మేవారు. ఆ తర్వాత చిన్నచిన్న హోటళ్లు వెలిశాయి. ఆ తర్వాత చాయ డబ్బాలు వచ్చాయి. ఇప్పుడు ఆ చాయ కాస్త రకరకాల బ్రాండ్ పేర్లతో సొంత వ్యవస్థను ఏర్పాటు చేసుకొని ప్రజలను ఆకర్షిస్తున్నది. మార్కెట్‌లో చాయ్ వాలా, బాబాయ్, టీ పాయింట్, టీ టైం, ఆర్మీ వాలా చాయ్, బెల్లం చాయ్, అమృతతుల్య, టీ కింగ్స్, ఇండియన్ కింగ్స్ వంటి ఎన్నో పేర్లతో ప్రత్యేక టీస్టాళ్లు వెలిశాయి. ప్రజలకు కొత్తకొత్త కార్పొరేట్ రుచులను చూపిస్తున్నాయి. ఈ స్టాళలను ఏర్పాటు చేయడానికి నిర్వహకులు మూడు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయలు ఆయా కంపెనీలకు చెల్లిస్తే టీపాయింట్ ఏర్పాటు చేసుకోవడానికి ఒక సెటప్‌ను ఇచ్చి టీ చేయడంలో శిక్షణ కూడా ఇస్తారు. తమకు మాత్రమే సొంతమైన రుచిగల టీ పౌడర్‌ను సమకూర్చుతారు. ఆ టీపౌడర్‌ను వాడి మాత్రమే టీ తయారు చేయాల్సి ఉంటుంది. కార్పొరేట్ టీపాయింట్లు రావడంతో అంతకుముందే విస్తరించి ఉన్న రాజస్తాన్ టీస్టాళ్లవారు, ఇతర టీకొట్లు కొత్తకొత్త రుచులను అందించి తమ గిరాకీని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. రుచికి రుచి ఆరోగ్యానికి ఆరోగ్యం అంటూ కొత్తకొత్త టీ తయారు చేసి వినియోగదారులకు అందిస్తున్నారు.



టీ తాగుతున్న నగరవాసులు



● ఎన్నో రకాలు

దమ్‌టీ, జింజర్‌టీ, గ్రీన్‌టీ, బేసిల్ టీ, బెల్లం టీ, పింక్ టీ, లెమన్‌గ్రాస్ టీ, ఇమ్యూనిటీ టీ, లెమన్ టీ, తులసీ టీ, మసాలా టీ, కుల్లాడ్ టీ, బ్లాక్‌టీ, కశ్మీరి చాయ్, ఇరానీ టీ, కాఫీ, సూపర్ హెర్బ్ అశ్వగంధ్‌టీ వంటి టీ లను ఇస్తూ ప్రజలకు కొత్త రుచులు చూపుతున్నారు. గతంలో టిఫిన్, భోజన హోటళ్లలో టీ తయారు చేసి ఇచ్చే వారు. ఇప్పుడు వారు కాస్తా తమకు అనుబంధంగా టీ దుకాణాలను ఏర్పాటు చేయించి వారి నుంచి కొంత కమీషన్ తీసుకొని చాయ అమ్ముకునే అవకాశం కల్పిస్తున్నారు. కార్పొరేట్ టీ పాయింట్లలో ప్రత్యేక రుచి ఉండడంతో వాటిని నచ్చిన వారు ఆ ప్రత్యేక టీ పాయింట్లకే వెళ్లి టీ తాగుతుండడంతో కొన్ని టిఫిన్ సెంటర్లలో చాయ, కాఫీ ఇవ్వడం మానేశారు. మొత్తానికి బ్రిటీష్ వాళ్ళు ఫ్రీగా అందించి అలవాటు చేసిన టీ ఇప్పుడు కార్పొరేట్ రుచులతో ప్రజల అందుబాటులోకి వచ్చింది.

లాభాలు బాగానే ఉన్నాయి...

- కూస శేఖర్, కలెక్టరేట్ టీ టైం

కలెక్టరేట్ ప్రాంతం కావడంతో లాభాలు బాగానే ఉన్నాయి. టీ టైం కంపనీకి 4.5 లక్షలు చెల్లించి వ్యాపారం చేసుకుంటున్నాం. ప్రతీ నెలా ఆర్డర్ చేస్తే మెటీరియల్ వాళ్లే పంపిస్తారు. షాపు నిర్వహణ కోసం ఓ షెట్టర్ కిరాయి తీసుకున్నాం... నా ద్వారా కొందరు ఉపాధి పొందుతున్నారు.

చాయ్ చాలా బాగుంది..

- మల్లేశ్

చాయ్ చాలా ఉంది. ఎప్పుడు వచ్చినా ఇక్కడే తాగుతా. ఉత్సాహం, ఉత్తేజం కలుగుతుంది. నాణ్యత, ప్రమాణాలతో కూడిన తేనీరు అందిస్తున్నారు.

ఇరానీ చాయ్‌కు ప్రాధాన్యం

-షాహిద్‌ఖాన్, ఎల్లో కేఫ్ నిర్వాహకుడు

విద్యాసంస్థలకు నిలయమైన ముఖరంపురలో విద్యార్థులు, యువత ఇరానీ చాయ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. పాలను బాగా మరగబెట్టి నాణ్యమైన చాయ్‌పత్తాలను వాడి చాయ్ తయారు చేస్తాం. పాలకు కూడా గిరాకి ఉంటుంది. బాగా మరిగిన పాలతో రుచి ఉంటుంది.



బెల్లం టీని ఎక్కువ ఇష్టపడుతున్నారు.

-బి రవి, బెల్లం టీ బ్రాంచెస్ నిర్వాహకుడు

ప్రతిరోజు 600 వరకు బెల్లం టీలు అమ్ముతాం. ఎక్కువగా రిటైర్ఎంప్లాయిస్, యువత బెల్లం టీ ని ఇష్టపడుతున్నారు. బెల్లం ఆరోగ్యానికి మంచిది. చాయపత్తి, యాలకుల పొడి, బెల్లం పౌడర్ కలిపి కంపెనీ పంపిస్తుంది. ప్రతి 10 రోజులకు ఒకసారి ఆర్డర్ చేస్తాం.

మట్టి కప్పుల్లో స్పెషల్ టీ

- జె అంజయ్య, ఆర్మీ చాయ్ బార్ నిర్వాహకుడు

రెండు సంవత్సరాల క్రితం ఆర్మీ చాయ్ బార్ ఏర్పాటు చేశాం. బాగా నడుస్తుంది. మట్టి కప్పుల్లో టీని ఇస్తాం. ప్రతిరోజు 500 వరకు టీలు అమ్ముతున్నాం.

13 రకాల టీని అమ్ముతున్నాం..

-నితీష్‌కుమార్, అమృతతుల్య టీ సెంటర్

సుమారు 13 రకాల టీ అమ్ముతున్నాం. గిరాకీ బాగా ఉంటోంది. ఎందరో ఈ రకరకాల చాయలను ఆస్వాదిస్తున్నారు. వారి అభిరుచులకు అనుగుణంగా చాయలను అప్పటికప్పుడు తయారు చేసి ఇస్తాం.

నేడు సహకార భారతి రాష్ట్ర సమ్మేళనం

భగత్‌నగర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని చింతకుంట గ్రామంలో ఆదివారం సహకార భారతి రాష్ట్ర సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈసమ్మేళనానికి వెయ్యిమంది కార్యకర్తలు హాజరు కానున్నట్లు సహకార భారతి రాష్ట్ర సమ్మేళన ప్రముఖ్ న్యాలమడుగు శంకరయ్య తెలిపారు. మహాసభలకు సహకార భారతి జాతీయ సంఘటన మంత్రిసంజయ్ జీ పాచ్పోర్, సహకార భారతి జాతీయ మంత్రి నందినీరాయ్ హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారన్నారు.

పోలీసు కుటుంబాలకు చెక్కులు అందజేత



చెక్కులను అందజేస్తున్న అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ


కరీంనగర్ క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యం కారణంగా మరణించిన పోలీసు అధికారుల కుటుంబాలకు భద్రత పథకం కింద ఆర్థిక సహాయం చెక్కులను శనివారం అడిషనల్ డీసీపీ లక్ష్మినారాయణ అందజేశారు. సీసీఆర్‌బీలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ఇటీవల గుండెపోటుతో మరణించిన కె లింగారెడ్డికి భద్రతా విభాగం నుంచి మంజూరు అయిన 16 లక్షల చెక్‌ను అతని భార్యకు అందజేశారు. అలాగే ఏఆర్ విభాగంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ మరణించిన ఎం శ్రీనివాస్ కుటుంబానికి 8 లక్షలు, ట్రాఫిక్ కానిస్టేబుల్ టి కుమారస్వామి కుటుంబానికి 8 లక్షల రూపాయల చెక్‌లను వారి భార్యలకు అందజేవారు. ఈ కార్యక్రమంలో సీపీఓ, జూనియర్ అసిస్టెంట్ కళ్యాణి పాల్గొన్నారు.


కేంద్ర మంత్రిపై ప్రభుత్వ తీరు అప్రజాస్వామికం

భగత్‌నగర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌పై రాష్ట్ర ప్రభుత్వ వ్యవహార శైలి అప్రజాస్వామికమని బీజేపీ సీనియర్‌నాయకుడు కొట్టె మురళీకృష్ణ అన్నారు. నిరుద్యోగులకు సంఘీభావంగా గ్రూప్-1 అభ్యర్థులకు మద్దతు తెలిపిన కేంద్ర మంత్రిని అరెస్టుచేయడం రాష్ట్ర ప్రభుత్వానికి చేతగాని తనానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు నిరుద్యోగుల పాలిట శాపంగా మారాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న అవగాహన రాహిత్యంతో వివిధ వర్గాల ప్రజలు వేలమంది రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తున్నారన్నారు. నిరుద్యోగుల పక్షాన మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదన్నారు. జీవో నెంబర్ 29తో నిరుద్యోగులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఉద్యోగాల ఉపాధి కల్పనలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. గ్రూప్-1 బాధితులకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం వారితో చర్చలు జరపాలన్నారు. రిజర్వేషన్లను రద్దు చేసి బడుగు బలహీన వర్గాల నిరుద్యోగుల పొట్ట కొట్టడమే లక్ష్యంగా జీవో29ని తీసుకువచ్చారన్నారు.

స్మార్ట్ కార్డులు వచ్చేశాయ్..

- ప్రారంభమైన ఆర్సీల ప్రింటింగ్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తొలగనున్న ఇబ్బందులు





తిమ్మాపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖా కార్యాలయాల్లో స్మార్ట్ కార్డుల కొరత తీరనుంది. రవాణా శాఖా కార్యాలయాల్లో స్మార్ట్ కార్డుల కొరత కారణంగా గత నెల 29 నుంచి ఆర్సీ కార్డుల ప్రింటింగ్ నిలిచిపోయింది. 'స్మార్ట్ కార్డుల కొరత శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 14వ తేదీన కథనం ప్రచురితమైంది. ఈ స్మార్ట్ కార్డుల కొరత అనేది కేవలం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగానే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా నెలకొని ఉంది. కాగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కరీంనగర్‌లోని డీటీసీ కార్యాలయంతో పాటు హుజూరాబాద్, పెద్దపల్లి, రామగుండం, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కోరుట్ల ఆర్టీవో కార్యాలయా పరిధిలో కూడా ఆర్సీ కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం ప్రతీ రోజు సుమారు వెయ్యి వరకు దరఖాస్తులు వస్తుంటాయి. డ్రైవింగ్ లైసెన్స్‌లకు కార్డులు కొంత మేరకు అందుబాటులో ఉన్నా ఆర్సీ కార్డులు కొరత ఉంది. గత నెల 29 నుంచి ఆర్సీకార్డుల ప్రింటింగ్ కూడా కార్యాలయాల్లో నిలిచిపోయింది. దీంతో కొత్త వాహనాలకు నంబరు ప్లేట్లు బిగించుకోవడానికి వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం నాలుగు వేల స్మార్ట్ కార్డులు రవాణా శాఖా కార్యాలయాలకు చేరుకున్నాయి. దీంతో పెండింగ్‌లో ఉన్న ఆర్సీ కార్డులతో పాటు ప్రస్తుత ఆర్సీ కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌ల ప్రింటింగ్ పూర్తి చేసి వాహనాదారులకు పంపించే పనుల్లో రవాణా శాఖా సిబ్బంది నిమగ్నం ఉన్నారు. కార్డులు ప్రింటింగ్ అవుతుండడంతోనే వాటిని సంబంధిత వాహనా దారులకు పోస్ట్ ద్వారా పంపించే ప్రక్రియ కూడా ప్రారంభించారు. మరో రెండు, మూడు రోజుల్లో పెండింగ్‌లో ఉన్న కార్డులను ప్రింటింగ్ పూర్తి చేసి పోస్ట్ ద్వారా సంబంధిత వాహనాదారులకు పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ

స్వామివారిని దర్శించుకున్న దేవాదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు



ధర్మపురిలో క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



యమధర్మరాజు ఆలయం వద్ద పూజలు చేస్తున్న రామకృష్ణారావు

ధర్మపురి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం స్వామి వారలకు వేదపండితులు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అభిషేకం, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం, నరసింహ హోమం జరిపించారు. రావి చెట్టు ఆంజనేయ స్వామి విగ్రహం చుట్టు ప్రదక్షిణాలు చేశారు. క్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామి అనుబంధ యమ ధర్మరాజు ఆలయంలో శనివారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అప మృత్యు నివారణ కోసం అర్చకులు పూజలు నిర్వహించారు. భక్తులు గండ దీపంలో నూనె పోసి స్వామివారలను దర్శనం చేసుకున్నారు. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ ఎం రామకృష్ణారావు కుటుంబ సమేతంగా శనివారం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, అర్చకులు ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ వారికి స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఓటరుగా నమోదు చేసుకోవాలి

గంభీరావుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరుగా నమోదు చేసుకోవాలని గంభీరావుపేట తహసీల్దార్ భూపతి వెల్లడించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ భూపతి మాట్లాడుతూ అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు క్రమంలో ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటరుగా నమోదు చేసుకోవడానికి పట్టభద్రులు 2021వ సంవత్సరంలోపు డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. డిగ్రీ మెమో లేదా ప్రొవిజనల్ సర్టిఫికెట్ ఓటరు ఐడీ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్ కార్డు, ఫోన్ నంబరు, ఈ-మెయిల్ ఐడీతో అందుబాటులో ఉన్న మీసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. తిరిగి అప్లైయి చేసిన ఫారంతో పాటు పైన పేర్కొన్న అన్ని సర్టిఫికెట్లు జిరాక్స్ జతచేసి అటెస్టెడ్ చేయించి తహసీల్దార్ ఆఫీస్‌లో సమర్పించాలన్నారు. గతంలో ఓటు వేసిన పట్టభద్రులు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందేనని, నవంబరు 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

ప్రభుత్వ దవాఖానాలో మందుల కొరత

ముస్తాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ మండలం పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శీలం స్వామి అన్నారు. బీఆర్‌ఎస్ కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్‌తో కలిసి ఆరోగ్య కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఆసుపత్రిలో బీపీ, షుగర్, దగ్గు, జ్వరం సంబంధిత రోగాలకు మందులు కరువయ్యాయని మండిపడ్డారు. ఆరోగ్య కేంద్రంలో ముగ్గురు స్టాఫ్ నర్సులకు ఒక్కరితోనే కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అనంతరం మండల వైద్యాధికారి గీతాంజలితో ఆసుపత్రి సమస్యలపై చర్చించారు. రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు శేఖర్, కిట్టు, మహేష్, జహంగీర్, నరేంద్రచారి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

బోయినపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలం కొదురుపాక బ్రిడ్జిపై శనివారం బైక్ అదుపు తప్పి యువకుడికి గాయాలయ్యాయి. వేములవాడ అర్బన్ మండలం గుర్రవానిపల్లికి చెందిన సంపత్ ద్విచక్ర వాహనంపై కొదురుపాక వైపు వస్తూ అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో సంపత్ గాయాలవగా స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.



స్వామియే.. శరణం అయ్యప్ప

(5వ పేజీ తరువాయి)

శబరి యాత్ర

దీక్షను స్వీకరించి నియమాలతో గడిపిన భక్తులు శబరిమలై యాత్ర చేస్తారు. దీక్ష స్వామి సన్నిదాన దర్శనంతో ముగుస్తుంది. శబరిమల కేరళలోని పత్తినం తిట్ట జిల్లాలో పశ్చిమ కనుమల్లో సహ్యాద్రిపర్వత శ్రేణుల ప్రాంతం కిందకు వస్తుంది. శబరిమలై యాత్ర ఎరుమెలితో మొదలవుతుంది. ఎరుమెలిలో వావరు స్వామిని భక్తులు దర్శించుకుంటారు. ఈ వావరు స్వామి ఒక ముస్లిం కులస్తుడు. ఇక్కడ మసీద్‌లోనే కొలువై ఉన్నాడు. వావరు స్వామి చుట్టు రకరకాల వేషాధారణలతో నాట్యం చేస్తారు. ఎరుమెలి వద్ద ఉన్న ధర్మశాస్త్ర ఆలయంలో వినాయ కుడు కూడా కొలువై ఉంటాడు. కన్నెమూల గణపతిగా పిలుస్తారు. ఇక్కడి నుండి పాదయాత్ర మొదలైవుతుంది. రెండు మార్గాలు ఉన్నాయి. పెద్ద పాదం అనేది కొండల మధ్య దట్టమైన ఆరణ్యంలో ఉన్న కాలిబాట. ఇది 80కిలోమీటర్ల దారి ఈ దారిలోనే పెరుర్‌తోడు, కాలైకట్టి అనే స్థలాలు ఉన్నాయి. అళదానది కూడా వస్తుంది. ఈ నదిలో స్నానాలు చేస్తారు. తరువాత యాత్రలో పంబా అనే గ్రామం ఉంటుంది. పంబానదిలో స్నానం చేసి ఏడు కిలోమీటర్లు ప్రయాణం చేసి అయ్యప్ప వద్దకు చేరుకుంటారు. ఇరుముడి తలపై పెట్టుకొని నీలిమలై కొండ మార్గం ద్వారా అయ్యప్ప సన్నిధికి చేరుకుంటారు.

ఇరుముడి పరమ పవిత్రం

అయ్యప్ప భక్తులు శబరిమలై వెళ్లే ముందు ఇరుముడితో బయలు దేరుతారు. ఇరుముడిలో నేతితో నింపిన కొబ్బరికాయ, రెండు కొబ్బరి కాయలు, వక్కలు, తమల పాకులు, నాణాలు, పసుపు, గందం పొడి, విభూది, పన్నీరు. బియ్యం, అటుకులు, మరమరాలు, బెల్లం లేదా అరటిపండ్లు, కలకండ, అగరవత్తులు, కర్పూరం, మిర్యాలు, తెనే, ఎండు ద్రాక్ష, తువ్వాలలు పెట్టుకుంటారు. దీన్ని ఇరుముడిగా కట్టుకునే ఉత్సవాన్ని కెట్టు నీర లేదా పల్లికెట్టు అంటారు.

పాదయాత్ర మరిచిపోలేను

పందిర్ల శ్రీనివాస్ గురుస్వామి, అల్మాస్‌పూర్

30 ఏళ్లుగా అయ్యప్ప దీక్ష తీసుకుంటున్నా. మణికంఠుడిని భక్తిశ్రద్ధలతో కొలిస్తే కోరికలు తీరుతాయి. 18వ సారి దీక్ష తీసుకున్న సమయంలో మహా పాదయాత్ర చేపట్టాం.



ఆరోగ్యానికి ఎంతో మేలు

రాచ విద్యాసాగర్, గురుస్వామి, సిరిసిల్ల అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ చైర్మన్

మహాపాదయాత్రను ఆరోగ్యా నికి కూడా మేలు చేస్తుంది. గతే దాది సిరిసిల్ల నుంచి శబరిమలైకి పాదయాత్ర చేపట్టాను. 60 రోజుల్లో పూర్తిచేశాను.



18 ఏళ్లుగా దీక్షను స్వీకరిస్తున్నా

అదిపెల్లి దేవయ్యగౌడ్, పెద్దూర్

అయ్యప్ప స్వామి దీక్షను 18 ఏళ్లుగా స్వీకరిస్తున్నా. పెద్ద పాదంతోపాటు చిన్న పాదయాత్ర లను చేపట్టి శబరి మలకు చేరు కునేవాడిని. ప్రస్తుతం దీక్షలోనే గడుపుతున్నా.



12 సార్లు పాదయాత్ర

రాజు గురుస్వామి, ముస్తాబాద్



. ఏటా మాల వేసుకొని కాలి నడకన శబరి మలైకి వెళ్లే శక్తిని స్వామి ఇచ్చారు. 12 సార్లు పాదయాత్ర చేశాను. కాశీ నుంచి శబరిమలకు, ముస్తాబా ద్ మీదుగా ఒకసారి వెళ్లాను.

అన్నదానం అదృష్టం

నాగపురి నర్సాగౌడ్



అన్నదానం చేయడం నా అదృష్టం. మండల దీక్ష పరులకు ఏటా అన్నదానం చేసే అవకాశం ఆ అయ్యప్ప స్వామి కల్పించాడు. ఇప్పటివరకు 30 సార్లు మాల వేసుకున్నా.

ఆధ్యాత్మిక కేంద్రంలో అల్పాహారం

జితేందర్ రావు, గురుస్వామి



అయ్యప్ప స్వాములకు 15 ఏళ్లుగా అల్పాహారం అందిచే భాగ్యన్ని స్వామి అందించారు. 19 ఏళ్లుగా మాల వేసుకుంటున్నాను. మాలధారులకు సేవ చేయడం నా అదృష్టం.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్థులు

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం

కోనరావుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మంగళపల్లి గ్రామంలో తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ గ్రామస్థులు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ నాయకులు బాల్‌రాజు, అవురం సురేష్, మారుపాక మల్లయ్య, మల్లయ్య, పరశురాములు, శ్రీనివాస్, రాజేశం, శేఖర్, ప్రశాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చందుర్తి : చందుర్తి మండలం మూడపల్లిలో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంచాయితి రాజ్ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. సింగల్ విండో ఉపాధ్యక్షులు పుల్కం మోహన్, నాయకులు పుల్కం లచ్చయ్య, బాణాల రవీందర్ రెడ్డి,సంటి యేసు దాసు, నీరటీ ప్రసాద్,వట్టిమర్ల రవి, సిరిగిరి కాంతారావు, గుజ్జుల నరేష్, పెంట శ్రీకాంత్, బద్దం భాస్కర్ రెడ్డి, మర్రిపల్లి నారాయణ, గ్రామ మహిళా సంఘ నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి తడిసిన ధాన్యం

రుద్రంగి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలో శనివారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి వ్యవసాయ మార్కెట్ యార్డులో పోసిన ధాన్యం కుప్పలు తడిసి ముద్దయ్యాయి. ధాన్యం కుప్పలపై కప్పిన టార్పలిన్ కవర్లపై వర్షం నీరు నిలిచిపోయింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మార్కెట్‌లో టార్పలిన్లు అందుభాటులో ఉంచాలన్నారు.

మహిళల ఆత్మరక్షణ కోసం కర్రసాము

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కర్రసాము శిక్షణ మహిళలు, యువతులు, బాలికల ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి రాధికా జైస్వాల్ అన్నారు. హెల్పింగ్ హార్ట్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 15 రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించగా శనివారం సిరిసిల్ల పట్టణం వెంకంపేటలోని శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. డిస్ట్రిక్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ కమటం అంజయ్య, స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు పున్నంచందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ - 1 అభ్యర్థులపై లాఠీచార్జి అమానుషం

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-1 అభ్యర్థులపై లాఠీచార్జి అమానుషమని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్ అశోక్‌నగర్‌లో న్యాయమైన తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న గ్రూప్ - 1 అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని బీఆర్‌ఎస్వీ ఖండిస్తున్నట్లు చెప్పారు. బీఆర్‌ఎస్వీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి ఉపాధ్యాయులను నియమించాలి

వీర్నపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో పూర్తిస్థాయి ఉపాధ్యాయులను నియమించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్ కుమార్ డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండలం అడవిపదిరలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు సరైన బోధన అందడం లేదని పాఠశాల ఎదుట శనివారం నిరసన చేపట్టారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం

వేములవాడ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆధైర్యపడవద్దని వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని సింగిల్ విండో చైర్మన్ బీరెడ్డి సల్మాన్‌రెడ్డి అన్నారు. వేములవాడ మండలం కొడుముంజ, అనుపురం, నాంపల్లిలో ధాన్యాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి నిధులు కేటాయించాలి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):ఎల్లారెడ్డిపేటలోని వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా మంజూరైన నిధులను కేటాయించాలని ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు శనివారం తిరుపతిలో టీటీడీ అధికారులకు వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి రూ.1.80 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు.

పాఠశాల డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా రాకేష్ గౌడ్

వీర్నపల్లి, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం గర్జనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా బుచ్చగారి రాకేష్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్‌కు దీటుగా విద్య అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానోపాధ్యాయులు వెంగళ శ్రీనివాస్, గజన్, ఉపాధ్యాయులు ప్రేమ్‌సాగర్, బలరాం, మంజుల పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణను ఆశిస్తూ తలపెట్టిన ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని మాదిగ, మాదిగ ఉపకులాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ కత్తెర దేవదాస్ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆత్మగౌరవ సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు.

పది మందికి ఆదర్శప్రాయంగా నిలవాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మంచి జీవనాన్ని ఆచరించి పదిమందికి ఆదర్శప్రాయంగా నిలవాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టులో మానసిక ఒత్తిడిపై కోర్టు ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ తరం వారికంటే పూర్వీకులు ఆరోగ్యంగా ఉన్నారని, ఆరోగ్యమే మహాభాగ్యమని అన్నారు. సీనియర్ సివిల్ జడ్జి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్, జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, లోక్ అదాలత్ సభ్యుడు భాస్కర్, మానసిక వైద్యనిపుణులు ప్రవీణ్, వంశీధర్, బార్ అసోసియేషన్ కోశాధికారి విష్ణు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రెండో రోజు సర్పంచుల దీక్షలు



దీక్షలో కూర్చున్న మాజీ సర్పంచులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడదల చేయాలని డిమాండ్ చేస్తూ సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో తాజా మాజీ సర్పంచులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజు కొనసాగాయి. శనివారం సీపీఎం పార్టీ జిల్లా అధ్యక్షుడు మోషేపు రమేష్, కోనరావుపేట మాజీ ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్ మద్దతు తెలిపారు. తాజా మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లును వెంటనే విడదల చేయాలని డిమాండ్ చేశారు. తాజా మాజీ సర్పంచుల జిల్లా జేఏసీ అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుమ్మ అంజయ్య జిల్లా ఉపాధ్యక్షురాలు శివజ్యోతి, కోశాధికారి వన్నమనేని వేణుగోపాల్‌రావు, కార్యదర్శి పడిగల రవీందర్, నాయకులు కోల నర్సయ్య, నారాయణ, తాడేపల్లి ఎల్లయ్య, బూర్గుల నందయ్య పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటామని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలోని వ్యవసాయ మార్కెటు కమిటీ కార్యాలయంలో శనివారం పాలక వర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబేరాబేగం మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. గ్రామాల్లో రైతులకు ఇబ్బందులు కల్గకుండా డైరెక్టర్లు చూడాలన్నారు. ఏమైనా సమస్యలుంటే వెంటనే అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. సన్నాలకు రూ.500 బోనస్ అందిస్తోందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులకు సేవ చేసే అవకాశం తమకు కల్పించిన మంత్రి ప్రభాకర్‌గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు తిరుపతిరెడ్డి, గణపతినాయక్, లక్ష్మారెడ్డి, నారాయణరెడ్డి, బాలయ్య, రవీందర్, కిష్టారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్, రాజేందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కనిమేని చక్రధర్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేసే ప్రయత్నం

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేయడానికి ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ కో కన్వీనర్ కనిమేని చక్రధర్‌రెడ్డి అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు ప్రజలను మోసం చేస్తూ వారి పబ్బం గడుపుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై సోషల్ మీడియా ద్వారా చెడుగా ప్రచారం చేస్తున్నారని ప్రజలు నమ్మవద్దని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆరు పథకాలలో నాలుగు అమలు చేసిందన్నారు. అధికారంలో ఉన్న సమయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు లక్ష రూపాయాలు కూడా రుణమాఫీ చేయలేక పోయిందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండు లక్షల రూపాయాల వరకు రుణమాఫీ చేసిందని అన్నారు. త్వరలోను రైతు బంధు కూడా ఇస్తుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఉద్యోగులకు, పెన్షనర్లకు సమయానికి జీతాలు ఇవ్వకుండా మాటలతో మభ్యపెట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని నిరూపిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిత్యం ప్రజల కోసం ఆలోచన చేస్తుంటారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కడతారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, మాజీ జడ్పీటీసీ యాదగిరిగౌడ్, గుండం నర్సయ్య మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ అంజన్‌రావు, నాయకులు కిషన్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, సత్తి శ్రీనివాస్‌రెడ్డి, ఎడ్ల తిరుపతి, బొప్ప వెంకటరమణ, సద్ది మధు, శ్రీకాంత్, విష్ణు, దేవేందర్ పాల్గొన్నారు.

రైతును రాజుగా చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

కోనరావుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతును రాజుగా చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలంలోని రామన్నపేట, ధర్మారం గ్రామాల్లో కొలనూరు సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారీ వ్యవస్థకు స్వస్తి పలికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కొనుగోలు కేంద్రాల నిర్వహణను మహిళా సంఘాలకు అప్పజెప్పినట్లు చెప్పారు. రైతుల సంక్షేమం దృష్ట్యా రైతులకు ఉచిత విద్యుత్ పంపిణీ ఫైల్‌పై తొలి సంతకం చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొనుగోళ్లు ఆలస్యమయ్యాయని, రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ప్రస్తుతం సమయానికి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామన్నారు. రాష్ట్రంలో ప్రాధాన్యత క్రమంలో పెట్టిన 9 ప్రాజెక్టుల్లో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉందని, మన ప్రాంతంలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా మరింత సస్యశ్యామలం అవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. మల్కపేట రిజర్వాయర్‌లో నీటిని నింపి కోనరావుపేట మండలంలోని సుమారు 7 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్యాక్స్ చైర్మన్ సంకినేని రామ్మోహన్‌రావు, కాంగ్రెస్ నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, కచ్చకాయల ఎల్లయ్య, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా పాల్గొన్నారు.

రుద్రంగి: కాంగ్రెస్ రైతు సంక్షేమ ప్రభుత్వమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

గత ప్రభుత్వ హయాంలో కొనుగోళ్లు ఆలస్యమయ్యాయని, దీంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ప్రస్తుతం రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. సెస్ డైరెక్టర్ అకుల గంగారం, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, కేసిరెడ్డి నర్సరెడ్డి, చెలుకల తిరుపతి, కొమిరె శంకర్, పల్లి గంగాధర్, గడ్డం స్వామి, లింగరెడ్డి, తర్రె లింగం, ఎర్రం రాజలింగం, అభిలాష్, స్వర్గం పరంధామ్, పుట్కపు మహిపాల్, పిడుగు లచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: రైతులు పండించిన పంటకు ఇంటి ముంగిటే మద్ధతు ధర కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, ప్యాక్స్ చైర్మన్ ఉచ్చిడి మోహన్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్, తిమ్మాపూర్, ఎల్లారెడ్డిపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని అల్మాస్‌పూర్, దుమాల, బుగ్గరాజేశ్వరతండా, అక్కపల్లి, తిమ్మాపూర్, రాగట్లపల్లి, కిష్టంపల్లి, కిషన్‌దాస్‌పేట, బొప్పాపూర్, కోరుట్లపేట, సింగారం, బండలింగంపల్లి, నారాయణపూర్, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, వైస్ చైర్మన్లు ప్రభాకర్, కృష్ణమూర్తి, సత్తయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు నర్సయ్య, వెంకటనర్సింహారెడ్డి, ప్రభాకర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్, లక్ష్మీబుచ్చాగౌడ్, గౌస్, శ్రీనివాస్, బాల్‌రెడ్డి, లక్ష్మణ్, నర్సింలు, సందీప్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామంలో పీఏసీఎస్ అల్మాస్‌పూర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఉచ్చిడి మోహన్ రెడ్డి శనివారం ప్రారంభించారు. వైస్ చైర్మన్ తాటిలెంక ప్రభాకర్, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, సొసైటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం నామాపూర్, రామిరెడ్డిపల్లి గ్రామాలలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలనువ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తలారి రాణి నర్సింలు ప్రారంభించారు. వైస్ చైర్మన్ వెలుముల రాంరెడ్డి, డైరెక్టర్లు కొమురయ్య, శ్రీకాంత్, కొండాపూర్ మాజీ సర్పంచ్ కరుణాకర్, మాజీ సెస్ డైరెక్టర్ విజయ రామారావు, కొండ రాజిరెడ్డి పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లె, అంకిరెడ్డిపల్లె గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుముల స్వరూపతిరుపతిరెడ్డి ప్రారంభించారు. సిరిసిల్ల ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సింగం గౌడ్ పాల్గొన్నారు.

రైతులను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

ఇల్లంతకుంట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు ఇచ్చుడే తప్ప రైతులను పట్టించుకోవడం లేదని, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని అనంతగిరి, సిరికొండ, రహీంఖాన్‌పేట, గాలిపెల్లిలో శనివారం రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం ఇంతవరకు అందలేదన్నారు. రైతుల రుణాలు మాఫీ చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు పూర్తి స్థాయిలో మాఫీ చేయలేదని విమర్శించారు. ప్రభుత్వంపై నమ్మకం లేకనే రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటున్నారన్నారు. అనంతరం వివిధ గ్రామాల్లో బాధిత కుటుంబాలను పరామర్శించారు. మాజీ జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, నాయకులు ఒగ్గు నర్సయ్యయాదవ్, ఎంద్ర చందన్, నీలం అంజయ్య, గొట్టెపర్తి పర్శరాం, ఒరుపుల రాములు, బాలకిషన్, బిల్లవేని పర్శరాం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఇల్లంతకుంట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులపై లాఠీచార్జిని నిరసిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. మండల శాఖ అధ్యక్షుడు వజ్జపల్లి శ్రీకాంత్ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రూపు 1 అభ్యర్థులు జీవో 29ని రద్దు చేయాలని అశోక్‌నగర్‌లో నిరసన తెలుపుతుండగా పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అభ్యర్థులతో చర్చలు జరపాలని, జీవో 55ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్, దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి హరీష్, నాయకులు గజ్జల శ్రీనివాస్, పల్లె సాయిప్రసాద్‌రెడ్డి, మ్యాకల మల్లేశం, ముత్తక్క, సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.